మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

మేడ్చల్‌కు జాతీయస్థాయి గుర్తింపు

» జిల్లాలో గణనీయంగా పెరిగిన అక్షరాస్యత

మేడ్చల్ ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): భారత ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన 'నవ భారత సాక్షరత' కార్యక్రమం యూఎల్ఎల్ఏఎస్ ఆధ్వర్యంలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో భాగమైన మేడ్చల్ - మల్కాజ్‌గిరి జిల్లా చేపట్టిన వినూత్న కార్యక్రమాలకు జాతీయస్థాయిలో గుర్తింపు లభించింది. ఇందుకు గాను కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ తమ అధికారిక ఎక్స్ (ట్విట్టర్)ఖాతాలో జిల్లా కార్యక్రమాలను ప్రచురించింది. జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ మార్గదర్శకత్వంలో ఈ మేరకు ఈ విజయం సాధ్యమైంది. సైబరాబాద్ మున్సిపల్ కమిషనరేట్, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్, జీహెచ్ఎంసీ పరిధిలోని ఆర్పీ(రిసోర్స్ పర్సన్స్)లతో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేయడం, అక్షరాస్యత లేని వారిని గుర్తించి యూఎల్ఎల్ఏఎస్, టాస్(తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ)పై విస్తృత ఓరియంటేషన్ కార్యక్రమాలు నిర్వహించడం. స్వచ్ఛంద ఉపాధ్యాయులు, అభ్యాసకులను భారీ సంఖ్యలో నమోదు చేయడం. దీని ఫలితంగా జిల్లా అక్షరాస్యత గణనీయంగా పెరిగింది. రాష్ట్రంలోనే మేడ్చల్ జిల్లాను 100 శాతం అక్షరాస్యత జిల్లాగా తీర్చిదిద్దడానికి అంకితభావంతో పనిచేయనున్నట్లు అదనపు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వయోజన విద్యాశాఖ ఉమ్మడి జిల్లా డైరెక్టర్ కె అనిత, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే ప్రాధాన్యం

» మేడ్చల్ డీఆర్వో మాలతి

అర్జీలు స్వీకరిస్తున్న డీఆర్వో మాలతి

మేడ్చల్ ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి(డీఆర్వో) మాలతి తెలిపారు. సోమవారం కలెక్టరేట్ నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆమె ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులు పరిశీలించి, చట్టపరిధిలో త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజావాణిలో వివిధ సమస్యలపై మొత్తంగా 86 అర్జీలు అందినట్లు తెలిపారు. సమస్యల పరిష్కారంలో అలసత్వం వహించరాదన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పరిగి కేంద్రంగా ఇసుక అక్రమ దందా జోరుగా సాగుతోంది. పలువురు వ్యాపారులు 'సిండికేట్'గా మారి దోపిడీకి పాల్పడుతున్నారు. అభివృద్ధి పనుల పేరిట కొందరు, అనుమతులు లేకుండా మరికొందరు 'మూడు లారీలు.. ఆరు ట్రాక్టర్లు' అన్న చందంగా వ్యాపారం సాగిస్తున్నారు. అయినా సంబంధిత అధికారులు కిమ్మనని దుస్థితి. అవసరాన్ని ఆసరాగా చేసుకొని ఇష్టారీతిన ధరలు పెంచుతూ విక్రయిస్తున్నారు. పది రోజుల క్రితం వరకు టన్ను ఇసుక రూ.1,200 ఉండేది ఇటీవల అమాంతం రూ.2 వేలకు పెంచడం గమనార్హం.

పరిగిలో ఇసుక అన్‌లోడ్ చేస్తున్న ట్రాక్టర్

ఇసుకాసురులు

పరిగిలో ఆగని ఇసుక అక్రమ రవాణా

అమ్మకాల్లో సిండికేట్‌గా వ్యాపారులు

- కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు విక్రయాలు
- పది రోజుల వ్యవధిలో టన్నుకు రూ.800 పెంపు
- ఇష్టారీతిన మామూళ్ల వసూలు
- చేతులు మారుతున్న లక్షల రూపాయలు
- పట్టించుకోని రెవెన్యూ, పోలీస్ అధికారులు!

పరిగి, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ప్రధానంగా జిల్లాలో బొంరాస్‌పేట్, యాలాల్ ప్రాంతాల్లో కొంత ఇసుక వనరులు ఉన్నాయి. ప్రభుత్వ పనులు, ఇందిరమ్మ ఇళ్ల కోసం స్థానిక ఇసుకకే అధికారులు అనుమతి ఇస్తున్నారు. ఇదే కాకుండా కరీంనగర్, పెద్దపల్లి, మల్లారం, భద్రాచలం, మహబూబ్‌నగర్ జిల్లా కోయిల్‌సాగర్, కోస్గీ ప్రాంతాల నుంచి పరిగికి ఇసుకను తరలిస్తున్నారు. ఒక్క లారీ వె బిల్లుతో తీసుకవస్తే మరో రెండు లారీల ఇసుకను స్థానికంగా తీసుకొచ్చి దొడ్డి దారిన సొమ్ము చేసుకుంటున్నారు. పొలాల వద్ద నాలుగు ట్రాక్టర్ల ఇసుక ఇంటి నిర్మాణం కోసం తీసుకెళ్లే వారిపై కేసులు, జరిమానాలు విధించే అధికారులు ఇష్టారీతిన అక్రమ దందా సాగుతున్నా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అనుమతి లేని ఇసుక లారీలు నిత్యం

మిగతా 6వ పేజీలో...

అక్రమంగా ఇసుక తరలిస్తూ పట్టుబడిన లారీలు(ఫైల్)

కఠిన చర్యలు తీసుకుంటాం

అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ఎక్కడి వరకు అనుమతి ఉంటే అక్కడే విక్రయించాలి. అనుమతి లేని ఇసుకను తరలిస్తే సీజ్ చేయిస్తాం. పరిగి పరిధిలో ఇసుక రీచ్‌లు లేవు. అయినా అనుమతి లేకుండా ఇక్కడి తీసుకొచ్చి అమ్మకాలు జరిపితే చర్యలు తప్పవు. బయట నుంచి కూడా అనుమతి లేకుండా పరిగికి తీసుకొచ్చి విక్రయించొద్దు.

-వెంకటేశ్వరి, తహసీల్దార్, పరిగి

సీఎం కొడంగల్ పర్యటన ఖరారు

4, 5 తేదీల్లో దౌల్తాబాద్, కొడంగల్, దుద్యాల్, మద్దూరులో పర్యటన

కొడంగల్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 4, 5తేదీల్లో సీఎం రేవంత్‌రెడ్డి కొడంగల్ నియోజకవర్గ పర్యటన ఖరారైంది. అభివృద్ధి పనుల పరిశీలన, ప్రారంభోత్సవాలను సీఎం రేవంత్‌రెడ్డి చేపట్టనున్నారు. 4వ తేదీ మధ్యాహ్నం నారాయణపేట జిల్లా మద్దూర్ మండలానికి చేరుకుంటారు. అక్కడ రూ.25 కోట్లతో నిర్మాణం చేపడుతున్న గురుకుల పాఠశాల, రూ.7 కోట్లకు పైగా నిధులతో నిర్మిస్తున్న డిగ్రీ కళాశాలతో పాటు పలు అభివృద్ధి పనులను పరిశీలించనున్నారు. అనంతరం అక్కడి నుంచి వికారాబాద్ జిల్లా దౌల్తాబాద్ మండలంలోని గోకఫస్లాబాద్‌లో రూ.25 కోట్లతో నిర్మాణం చేపడుతున్న గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాల పనులను పరిశీలించనున్నారు. అక్కడి నుంచి హకీంపేట్‌లో ఎడ్యుకేషన్ హబ్ పనులను పరిశీలించి అధికారులతో సమీక్ష నిర్వహించనున్నట్లు సమాచారం. అదే రోజు రాత్రి కొడంగల్‌కు చేరుకొని బస చేయనున్నారు. 5న కొడంగల్ నియోజకవర్గ కేంద్రంలోని అతిథి గృహం, ప్రభుత్వాసుపత్రి, జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలను ప్రారంభించనున్నారు. అనంతరం హకీంపేట్‌కు చేరుకొని ప్రభుత్వ జూనియర్ కళాశాలను ప్రారంభించనున్నారు.

తాండూరు సబ్ కలెక్టర్‌గా ప్రణయ్

తాండూరు, ఆగస్టు31(ఆంధ్రజ్యోతి): తాండూరు సబ్‌కలెక్టర్‌గా కొయ్యాడ ప్రణయ్‌కుమార్‌ను ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. 2024 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన ప్రణయ్‌కి శిక్షణానంతరం తాండూరు సబ్ కలెక్టర్‌గా పోస్టింగ్ ఇచ్చారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఆర్డీవో అనిత బదిలీపై స్పష్టత రాలేదు. గతంలో సబ్‌కలెక్టర్ హోదా ఉన్న ఈ కార్యాలయాన్ని ఆర్డీవో కార్యాలయంగా మార్చారు. ఇక్కడ పోస్టింగ్‌కు ఆర్డీవో స్థాయి నుంచి మరోసారి సబ్ కలెక్టర్ హోదా కల్పించారు.

ఫిర్యాదులను పరిశీలిస్తున్న ఉమాశంకర్ ప్రసాద్

ప్రజావాణికి 110 దరఖాస్తులు

» అదనపు కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్

వికారాబాద్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తంగా 110 దరఖాస్తులు వచ్చినట్లు అదనపు కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ తెలిపారు. ఆయన అదనపు కలెక్టర్ వెంకటాచారి, జిల్లా అధికారులతో కలిసి ప్రజల నుంచి ఫిర్యాదులు, అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు సమర్పించిన ఫిర్యాదులను అధికారులు ప్రాధాన్యతతో పరిశీలించి, నిబంధనల మేరకు సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు సమర్పించిన వినతులను పరిశీలించిన అదనపు కలెక్టర్ ఆయా సమస్యలను సంబంధిత శాఖల అధికారుల దృష్టికి తీసుకెళ్లి, నిబంధనల మేరకు పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, సేవలు సక్రమంగా అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఆర్వో స్వర్ణలత, జెడ్పీ సీఈవో సుధీర్, డీఆర్డీఏ పీడీ శ్రీనివాస్‌తో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

బలహీనులకు బలాన్నిద్దాం

నేటి నుంచి పోషణ మాసోత్సవం

- ఒక్కోరోజు ఒక ప్రత్యేక కార్యక్రమం
- జిల్లాలో మొత్తం 1,13,471 మంది పిల్లలు
- 7,139 మంది పిల్లలు అతి తక్కువ బరువు
- మధ్యస్థ బరువు 17,531 మంది

మేడ్చల్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పోషకాహారం ఆరోగ్యవంతమైన జీవనానికి ఎంతగానో ఉపయోగపడుతుంది. గర్భంలోని శిశువు ఎదుగుదల నుంచి శిశువు జన్మించే వరకు... ఆ తరువాత పెరుగుతున్న పిల్లలకు తగిన విధంగా పోషకాహారం అందిస్తే ఎంతో మేలు చేకూరుతుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళా సంక్షేమానికి ప్రత్యేక పథకాలు అమలు చేస్తున్నాయి. చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పోషకాహారం అందజేస్తున్నారు. అయినప్పటికీ కొన్ని కుటుంబాలు వీటిని అందిపుచ్చుకోవడం లేదు. కొందరు తల్లిదండ్రులు కుటుంబ ఆర్థిక పరిస్థితుల కారణంగా తమ పిల్లలకు పౌష్టికాహారం అందించలేకపోతున్నారు. రోజువారీ కూలీలుగా పనిచేసే కుటుంబాలు పోషణ విషయంలో తగిన శ్రద్ధ చూపడం లేదని తెలుస్తోంది. ఇటువంటి

మిగతా 6వ పేజీలో...

34,267 మందికి సాధారణ బరువు

మహిళా, శిశు సంక్షేమ శాఖ నివేదిక ప్రకారం జిల్లా వ్యాప్తంగా మొత్తం 1,13,471 మంది పిల్లలను పరిశీలించారు. వీరిలో 34,267 మంది పోషకాహార లోపం లేకుండా సాధారణ బరువు కలిగి ఉన్నారు. అతి తీవ్ర తక్కువ బరువు ఉన్న పిల్లలు 7,139 మంది ఉండగా మధ్యస్త బరువు ఉన్న 17,531 మందిని గుర్తించారు.

విస్తృతంగా అమలు

మార్చి నెలలో పోషణ పక్వాడా పేరుతో 15 రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాం. సెప్టెంబర్‌లో పోషణ మాసోత్సవం పేరిట వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తాం. ఈ మాసోత్సవాన్ని జిల్లా అంతటా విస్తృతంగా నిర్వహిస్తాం. ఇలా ఏడాదికి రెండు సార్లు పోషకాహార లోపంపై అవగాహన కల్పిస్తాం.

-శారద, మహిళా శిశు సంక్షేమ అధికారి

బీఆర్ఎస్ హయాంలో అభివృద్ధి శూన్యం

» తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

డిజిటల్ రేషన్ కార్డులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

పెద్దేముల్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పాలనలో నాయకులు అభివృద్ధి గురించి పట్టించుకోలేదని అంతా శూన్యమేనని, కోట్‌పల్లి ప్రాజెక్టులో తట్టెడు మట్టికూడా తీయలేదని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి ఆరోపించారు. పెద్దేముల్ మండలం కందనెల్లి సమీపంలోని జీపీఆర్ గార్డెన్‌లో సోమవారం డిజిటల్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే లబ్ధిదారులకు కార్డులను పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ రేషన్‌కార్డు ప్రభుత్వ పథకాలకు ప్రమాణికంగా నిలుస్తుందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక కోట్‌పల్లి ప్రాజెక్టు దుస్థితి ముఖ్యమంత్రికి వివరించగానే రూ.100 కోట్లు మంజూరు చేశారన్నారు. ప్రస్తుతం పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. కాగా, ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డికి వివిధ గ్రామాల మహిళా సర్పంచులు రాఖీ కట్టారు. అనంతరం గాజీపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ వేంకటచెన్నకేశవ స్వామి ఆయలంలో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు జాదవ్ ధారాసింగ్, డీసీసీబీ మాజీ చైర్మన్ లక్ష్మారెడ్డి, కరణం పురుషోత్తంరావు, మండల అధ్యక్షులు మహిపాల్‌రెడ్డి, సర్పంచ్ భూమె యాదమ్మ, తహసీల్దారు వెంకటేశ్ ప్రసాద్, ఎంపీడీవో తిరుమలస్వామి, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు నారాయణగౌడ్, గాజీపూర్ నారాయణరెడ్డి, సర్పంచ్ హేమలత, లాల్‌రెడ్డి వివిధ గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

ఘనంగా రామలింగేశ్వరుని పల్లకీ సేవ

కీసరగుట్టలోని శ్రీ రామలింగేశ్వరుని పల్లకీ సేవ ఘనంగా నిర్వహించారు. నిత్య సేవల్లో భాగంగా సోమవారం గర్భాలయంలోని మూలవిరాట్‌కు మహన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామివారి ఉత్సవ మూర్తులను పల్లకీలో ఉంచి ఆలయ ప్రాంగణంలో ఘనంగా ఊరేగించారు.

-కీసర, ఆగస్టు31(ఆంధ్రజ్యోతి)

స్వామివారి పల్లకీ సేవలో భక్తులు

ఎక్సైజ్ కార్యాలయానికి తాళం

» మూడేళ్లుగా అద్దె చెల్లించని అధికారులు
» సిబ్బంది ఉండగానే గేట్‌కు తాళం వేసిన యజమాని
» మేడ్చల్ ఎక్సైజ్ కార్యాలయంలో ఘటన

గేట్‌కు తాళం వేస్తున్న భవనం యజమాని

మేడ్చల్ టౌన్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మూడేళ్లుగా అద్దె చెల్లించకపోవడంతో మేడ్చల్ ఎక్సైజ్ పోలీస్ కార్యాలయానికి భవనం యజమాని తాళం వేశాడు. అద్దె చెల్లించండి మహా ప్రభో... అంటూ ప్రాధేయపడినా.. అధికారులు స్పందించకపోవడంతో కార్యాలయంలో సోమవారం సిబ్బంది విధులు నిర్వహిస్తుండగానే భవనం గేటుకు తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి ఆందోళనకు దిగాడు. వివరాల ప్రకారం నగరంలోని బీన్‌రెడ్డి నగర్ కాలనీకి చెందిన రిటైర్డ్ ఉద్యోగి విఠల్‌రెడ్డికి చెందిన భవనం మేడ్చల్ పట్టణంలోని ఎయిర్ ఫోర్స్ కాలనీలో ఉంది. ఈ భవనాన్ని 2011లో ఎక్సైజ్ పోలీసు కార్యాలయానికి రూ.7,547 నెలసరి అద్దెకు ఇచ్చాడు. కాగా, 2023 వరకు ఒప్పంద ప్రకారం ఎక్సైజ్ శాఖ వారు అద్దె చెల్లించారు. కాగా, 2023 నవంబర్ నుంచి అద్దె చెల్లించడం మానేశారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్, కమిషనర్ కార్యాలయాల్లో ఫిర్యాదు చేసినప్పటికీ స్పందన లేదు. దీంతో రావాల్సిన అద్దె డబ్బులను వెంటనే చెల్లించాలని నోటీసులు పంపిచాడు. అయినా అధికారులు స్పందించక పోవడంతో విఠల్ రెడ్డి సోమవారం సాయంత్రం కుటుంబ సభ్యులతో కలిసి ఎక్సైజ్ కార్యాలయానికి చేరుకొని అద్దె కోసం అధికారులను నిలదీయగా వారు పట్టించుకోలేదు. విసిగెత్తిన విఠల్‌రెడ్డి భవనం గేటుకు తాళం వేసి అక్కడే కూర్చున్నాడు. ఆ సమయంలో ముగ్గురు సిబ్బంది కార్యాలయంలో ఉండటం గమనార్హం.

అద్దె చెల్లించి.. భవనం ఖాళీ చేయండి

తనకు రావాల్సిన అద్దె చెల్లించి వెంటనే భవనం ఖాళీ చేయాలని భవనం యజమాని విఠల్ రెడ్డి ఎక్సైజ్ శాఖ ఉన్నత అధికారులను కోరారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందిచి తనకు న్యాయంచేయాలని విఠల్‌రెడ్డి కోరారు.. అధికారులు స్పందించేంత వరకు భవనం వద్ద నుంచి వెళ్లబోమంటూ భీష్మించి అక్కడే చీకటి పడేంత వరకు కూర్చున్నారు.

క్రేన్‌తో వ్యర్థాలు వెలికి తీస్తున్న సిబ్బంది

వినాయక ఘాట్ వద్ద వ్యర్థాల తొలగింపు

ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): ఎదులాబాద్ డివిజన్ పరిధిలోని లక్ష్మీనారాయణ చెరువు వినాయక ఘాట్ వద్ద ఎంఎంసీ అధికారులు వ్యర్థాల తొలగింపు పనులకు శ్రీకారం చుట్టారు. వినాయక చవితి సమీపిస్తుండటంతో చెరువులోని ఘాట్ వద్ద నిమజ్జనాలు చేయడంతో ఏళ్ల నుంచి అక్కడ వ్యర్థాలు పేరుకుపోయాయి. సోమవారం అధికారులు భారీ క్రేన్‌తో 40 అడుగుల వరకు ఉన్న వ్యర్థాల వెలికితీత పనులు ప్రారంభించారు. సుమారు పదేళ్లుగా వ్యర్థాలు తీయకపోవడంతో పెద్ద మొత్తంలో వ్యర్థాలు పేరుకుపోయాయి. మళ్లీ ఈ ఏడాది గణేశ్‌లను నిమజ్జనం చేస్తే నీటిలో మునుగకుండా తేలే ప్రమాదం ఉందని స్థానికులు పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఘట్‌కేసర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ వాణి అదేశాల మేరకు వ్యర్థాలను వెలికి తీయడం ప్రారంభించారు. ఇందుకు గాను రూ.20 లక్షల నిధులు మంజూరు చేసినట్లు డీఈఈ నరేశ్ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో ఘట్‌కేసర్ సీఐ బాలస్వామి, ఏఈ రవికిరణ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలి

మొక్క నాటుతున్న సమతావెంకట్‌రెడ్డి

చేవెళ్ల, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని చేవెళ్ల మున్సిపల్ ఛైర్‌పర్సన్ సమతా వెంకట్‌రెడ్డి అన్నారు. సోమవారం మున్సిపల్ పరిధిలోని పామెన 8వ వార్డులోని ప్రభుత్వ పాఠశాలలో వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నాటిన మొక్కలను సంరక్షించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ రాములుగౌడ్, కౌన్సిలర్లు దావల్‌గారి గోపాల్‌రెడ్డి, కళ్యాణి, మానిషారెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు, నాయకులు యాదయ్యగౌడ్, ఎర్ర గోపాల్, విజయ్, బాల్‌రాజ్ పాల్గొన్నారు.

రాష్ట్రంలో బీజేపీని అధికారంలోకి తెస్తాం

శంషాబాద్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో బీజేపీని అధికారంలోకి తేవడానికి కృషి చేస్తానని బీజేపీ రాష్ట్ర సాంస్కృతిక విభాగం సభ్యుడిగా నియమితులైన సిద్దోజు మాధవచారీ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్రమోదీ పేద ప్రజల అభివృద్ధికి చేపట్టే కార్యక్రమాలు ప్రపంచ వ్యాప్తంగా మంచిపేరు తెచ్చిపెడుతున్నాయని పేర్కొన్నారు. బీజేపీ సిద్ధాంతాన్ని ప్రజలకు అవగతమయ్యేట్టు చేసి ప్రజల్లో చైతన్యం తెస్తానన్నారు. తనపై నమ్మకంతో బీజేపీ రాష్ట్ర సాంస్కృతిక విభాగం సభ్యుడిగా నియమించినందుకు పార్టీ సాంస్కృతిక విభాగం కన్వీనర్ నాగపురి రాజమౌళి, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచంద్రర్‌రావులకు కృతజ్ఞతలు తెలిపారు.

లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కల్యాణలక్ష్మి ఆగదు: ఎమ్మెల్యే శంకర్

షాద్‌నగర్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు పన్నినా కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకాలు కొనసాగుతాయని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఈ మేరకు సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో షాద్‌నగర్ నియోజకవర్గానికి చెందిన 127 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.31.60 లక్షల సీఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సంక్షేమ పథకాలపై ప్రతిపక్షాలు కావాలనే ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయని మండిపడ్డారు. గత ప్రభుత్వ హయాంలోనే పథకాల అమలులో లోటుపాట్లు ఉన్నాయని, వాటిని సరిదిద్ది పకడ్బందీగా అమలు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ అగ్గనూరు బసవేశ్వర్, వైస్ ఛైర్మన్ అందె మోహన్, కౌన్సిలర్ మురళీమోహన్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో ముందుంటాం

మాట్లాడుతున్న అదనపు ఎస్పీ రాజేశ్‌మీనా

వికారాబాద్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారంలో, వారికి మెరుగైన సేవలందించడంలో పోలీస్ శాఖ ఎప్పుడూ ముందే ఉంటుందని అదనపు ఎస్పీ రాజేశ్‌మీనా అన్నారు. సోమవారం పోలీస్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించి ప్రజా ఫిర్యాదులు, వినతులను స్వీకరించారు. ఆయన ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులు, పోలీసు సిబ్బందికి సూచనలు, ఆదేశాలు జారీ చేశారు.

అంకితభావంతో విధుల నిర్వహణ అభినందనీయం

రిటైరైన అధికారులను సన్మానిస్తున్న రాజేశ్‌మీనా

విష్ణువర్ధన్‌రెడ్డిని సన్మానిస్తున్న కొమరయ్య

వికారాబాద్,ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): పోలీసు శాఖలో రవికుమార్, అంబాజీలు అంకితభావంతో సుదీర్ఘ కాలం విధులు నిర్వహించారని వికారాబాద్ అదనపు ఎస్పీ రాజేశ్‌మీనా అభినందించారు. సోమవారం ఎస్పీ కార్యాలయంలో ఉద్యోగ విరమణ కార్యక్రమం నిర్వహించారు. ఉద్యోగ విరమణానంతరం వారు ఆరోగ్యంగా, ఆనందంగా జీవనాన్ని గడపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డీఎస్‌బీ సీఐ నాగార్జున, భరోసా ఇన్‌స్పెక్టర్ ప్రమీల, రమేష్‌కుమార్, పోలీసు అధికారులు, సిబ్బందిసన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

ఉపాధ్యాయులే జాతి నిర్మాతలు

షాద్‌నగర్: ఉపాధ్యాయులే జాతిని నిలబెట్టే నిర్మాతలని మహబూబ్‌నగర్ ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి అన్నారు. సోమవారం షాద్‌నగర్ పట్టణంలోని ఓ ఫంక్షన్ హాలులో కేశంపేట మండలం పాపిరెడ్డిగూడ ప్రభుత్వ పాఠశాల హెడ్‌మాస్టర్ కొప్పునూరు ప్రవీణ్‌కుమార్ ఉద్యోగ విరమణ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్, మున్సిపల్ ఛైర్మెన్ అగ్గనూరు బసవేశ్వర్, కొందూటి నరేందర్, ఏఈవో మనోహర్, హర్షవర్ధన్, గిరిధర్ కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థులను తీర్చిదిద్దేది ఉపాధ్యాయులే..

షాబాద్ : విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దేది ఉపాధ్యాయులే అని ఎమ్మెల్సీ మల్క కొమరయ్య అన్నారు. సోమవారం మండల పరిధిలోని తాళ్లపల్లి జెడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయుడు డాక్టర్ సూరం విష్ణువర్ధన్‌రెడ్డి ఉద్యోగ విరమణ సందర్భంగా నిర్వహించిన అభినందన సభకు హాజరై మాట్లాడారు. ఉపాధ్యాయ వృత్తి కేవలం ఉద్యోగం కాదని, అది బాధ్యత, సేవతోపాటు ఒక తరం భవిష్యత్తును తీర్చిదిద్దే మహత్తరమైన అవకాశమని పేర్కొన్నారు.

బోనమెత్తిన పల్లె

ఆమనగల్లు: బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

మల్లారెడ్డిగూడలో బోనాలతో మహిళలు, గ్రామస్తులు

ఆమనగల్లు/షాబాద్/మహేశ్వరం, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): ఊరూరా బోనాల సంబురాలు అంబరాన్నంటుతున్నాయి. ఆమనగల్లు పట్టణంలో సోమవారం పోచమ్మకు మహిళలు బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ వేడుకలకు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి హాజరయ్యారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ పత్యానాయక్, వైస్ ఛైర్మన్ తల్లోజు గీత, మార్కెట్ వైస్‌ఛైర్మన్ గూడూరు బాస్కర్‌రెడ్డి, మాజీ వైస్ ఛైర్మన్ కేశవులు, ఎస్‌హెచ్‌వో వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు రమేశ్, వెంకటయ్య, మహేశ్, ఆంజనేయులు, జగన్, అనూషశ్రీశైలం, సర్పంచ్ మండ్లీ రాములు, మాజీ కౌన్సిలర్ చెన్నకేశవులు పాల్గొన్నారు. షాబాద్ మండల పరిధిలోని మల్లారెడ్డిగూడ, కొమరబండ గ్రామాల్లో పోచమ్మ, మైసమ్మ బోనాలు ఘనంగా జరుపుకున్నారు. ఆలయాలను విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు. బోనాల ఊరేగింపులో డప్పు దరువులు, పోతరాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సర్పంచ్‌లు అమీర్‌పేట్ సబితాగోవర్ధన్‌రెడ్డి, కుక్కల పద్మమ్మగోపాల్, మాజీ సర్పంచ్‌లు ఆవాంచ దేవేందర్‌రెడ్డి, ఏశాల చంద్రశేఖర్, చందిప్ప జంగయ్య, ఉపసర్పంచులు మాణిక్యం, శేఖర్ పాల్గొన్నారు. అలాగే మహేశ్వరం మండలంలోని శ్రీ రావిరాల సూర్యగిరి ఎల్లమ్మ బోనాల సందర్భంగా అంబోజు శ్రీకాంత్ ఆధ్వర్యంలో గటాల ఊరేగింపు వైభవంగాజరిగింది. ఆలయ ఫౌండర్ రెడ్డిగల్ల రత్నం పాల్గొన్నారు.

చౌడాపూర్: వెంకటాపూర్‌లో బోనాల ఊరేగింపు

బంగారు మైసమ్మకు..

చౌడాపూర్: చౌడాపూర్ మండల పరిధిలోని మక్త వెంకటాపూర్‌గ్రామంలో బంగారు మైసమ్మ బోనాల ఉత్సవాలను సోమవారం ఘనం గా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

ఘనంగా శ్రావణ సోమవార పూజలు

ధారూరు : శ్రావణ మాస మూడో సోమవారం సందర్భంగా ధారూరు వీరభద్రేశ్వర ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆలయంలోని శివలింగంకు జల, క్షీరాభిక్షేకం చేసి నైవేద్యం సమర్పించి హారతినిచ్చి మొక్కుకున్నారు. గణపతి, సుబ్రమణేశ్వర,వీరభద్రేశ్వర స్వామి, అమ్మవారు, నందివిగ్రహాలకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజారి చెన్నబసవయ్య స్వామిభక్తులకు తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు.

ముగిసిన ఆరాధానోత్సవాలు

తాండూరు :తాండూరులో గురు రాఘవేంద్రస్వామి 355వ ఆరాధనోత్సవాలు ముగిశాయి. 3వ రోజు సోమవారం ఉత్తరాధన నిర్వహించారు. స్వామివారిని పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. పట్టణంలోని కాలనీల ప్రజలు స్వామివారిని దర్శించుకున్నారు. మునిసిపల్ మాజీ ఛైరపర్సన్ స్వప్నపరిమళ్ దంపతుల ఆధ్వర్యంలో ఉత్సవాలను నిర్వహించారు.

దేవతా విగ్రహాల ప్రతిష్ఠాపనోత్సవాలు

ధారూరు: ధారూరులో దేవతా విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. విద్యా గణపతి, దత్తాత్రేయ స్వామి, గ్రామ దేవతలు ఊరడమ్మ, మైసమ్మ, ఎల్లమ్మ, రుక్మిణి సమేత పాండురంగస్వామి, నాగదేవత విగ్రహాలు, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన పూజలు జరిగాయి. ఆలయాల్లో పురోహితుల మంత్రోచ్చరణల మధ్య దేవతా విగ్రహాలను ప్రతిష్ఠించారు. మాజీ ఎమ్మెల్యే ఎం.ఆనంద్, బీఆర్ఎస్ నాయకులతో కలిసి పూజల్లో పాల్గొన్నారు. సర్పంచ్ ప్రమీల తదితరులు పాల్గొన్నారు.

బుగ్గ ఆలయంలో మాజీ ఎమ్మెల్యే పూజలు

వికారాబాద్ : మనిషి శరీరానికి యోగా, మనస్సుకు ఆధ్యాత్మిక చింతన అవసరమని మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ అన్నారు. బుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయంలో ఆయన పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.

మహేశ్వరం: రావిరాల నుంచి సూర్యగిరి ఎల్లమ్మ ఆలయం వరకు ఘటాల ఊరేగింపు

ధారూరు: శివలింగానికి పూజలు

బుగ్గలో పూజలు చేస్తున్న మెతుకు ఆనంద్



'సైన్స్ ల్యాబ్ ఆన్ వీల్స్' ప్రారంభం

మొబైల్ వాహనాన్ని ప్రారంభిస్తున్న సంస్థ ప్రతినిధులు

షాద్‌నగర్ రూరల్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సైన్స్‌లో విజ్ఞానాన్ని పెంపొందించేందుకు 'సైన్స్ ల్యాబ్ ఆన్ వీల్స్' ప్రోగ్రాంను ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నామని ప్రగతి వెల్ఫేర్ సొసైటీ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ చంద్రశేఖర్ అన్నారు. ఫరూఖ్‌నగర్ మండలం బూర్గుల గ్రామంలో సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని 13 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు మొబైల్ సైన్స్ ల్యాబ్ వల్ల విజ్ఞానం పెంపొందుతుందని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ శివలీల, జిల్లాసైన్స్ అధికారి శ్రీనివాస్ రావు, ఎంఈవో మనోహర్, ఎంవీ ఫౌండేషన్ జాతీయ కన్వీనర్ వెంకట్‌రెడ్డి, ప్రాజెక్ట్ మేనేజర్ అరుణ్, ప్రధానోపాధ్యాయుడు రవికుమార్ పాల్గొన్నారు.

విద్యార్థుల్లోని క్రీడా నైపుణ్యాన్ని వెలికితీయాలి


విద్యార్థులతో ఉపాధ్యాయులు

శంకర్‌పల్లి, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీయాలని శంకర్‌పల్లి ఎంఈవో రవీందర్‌రావు అన్నారు. శంకర్‌పల్లి మున్సిపల్‌లోని సింగాపురంలోని బీపీఆర్ క్రికెట్ గ్రౌండ్‌లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జోనల్‌స్థాయి(శంకర్‌పల్లి, చేవెళ్ల మండలాలు) క్రికెట్ ఎంపిక పోటీలు సోమవారం జరిగాయి. అనంతరం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని సూచించారు. జోనల్‌స్థాయి క్రికెట్ పోటీల్లో 300మంది విద్యార్థులు పాల్గొనగా, 34మందిని ఎంపిక చేసినట్లు జోనల్ సెక్రటరీ అరుంధతి తెలిపారు. ఎంపికైన వారు జిల్లాస్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మహారాజ్‌పేట్ ప్రధానోపాధ్యాయుడు కృష్ణారెడ్డి, బస్వరాజ్, మల్లేష్, ప్రవీణ్, ప్రభాకర్ పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌తో కేసుల సత్వర పరిష్కారం

ఆమనగల్లు, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): పెండింగ్ కేసుల సత్వర పరిష్కారానికి లోక్ అదాలత్ చక్కటి వేదిక అని ఆమనగల్లు జూనియర్ సివిల్ జడ్జి అరుణ్‌కుమార్ అన్నారు. ఆమనగల్లు కోర్టులో ఈనెల 12న నిర్వహించే జాతీయ లోక్‌అదాలత్‌పై సోమవారం కోర్టు ఆవరణలో సమావేశం నిర్వహించారు. ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి, మాడ్గుల పోలీసు, ఎక్సైజ్, న్యాయవాదులతో చర్చించారు. వీలైనన్ని కేసులు రాజీపడేలా చూడాలన్నారు. సమావేశంలో పీపీ కార్తీక్, ఎస్‌హెచ్‌వోలు వెంకటేశ్వర్లు, సైదిరెడ్డి, జానకీరాంర్ రెడ్డి, ఎక్సైజ్ సీఐ బద్యనాథ్ చౌహాన్, ఆయా పోలీస్‌స్టేషన్ల ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిని సన్మానిస్తున్న విద్యార్థినులు

కళాశాల అంటే ఆత్మీయ బంధం

తాండూరు, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): కళాశాల అంటే రంగుల ప్రపంచం కాదని, కుల మతాలకు అతీతంగా మనసులను కలిపే ఆత్మీయ బంధాలు ఇక్కడ ఉంటాయని తాండూరు ఎమ్మెల్యే బి.మనోహర్‌రెడ్డి అన్నారు. సోమవారం తాండూరులోని తులసి గార్డెన్‌లో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు నిర్వహించిన వెల్‌కమ్ పార్టీలో పాల్గొని మార్గదర్శనం చేశారు. విద్యార్థులు అందరు ఒకే కుటుంబంలా మెదలాలని సూచించారు. ఇంటర్మీడియట్ రెండేళ్ల చదువు కాదని.. అది జీవితానికి దిశానిర్దేశం చేస్తుందని వివరించారు. పాఠ్యపుస్తకాలతో పాటు జీవిత పాఠాలు నేర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నీరజ, ఇంటర్ బోర్డు నోడల్ అధికారి శంకర్‌నాయక్, వైస్‌చైర్మన్ అబ్దుల్ రజాక్, కౌన్సిలర్ బంటు వేణుగోపాల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జానపద వేదికపై జిల్లా కళాకారుల ప్రతిభ

కళా ప్రదర్శనలో కళాకారులు

బొంరాస్‌పేట్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో సోమవారం నిర్వహించిన జానపద జాతరలో వికారాబాద్ జిల్లా కళాకారులు తమ ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. చించల్‌పేట్ శిరీష బృందం కోలాటం, దాదాపూర్ చెన్నయ్య భజన, బొంరాస్‌పేట్ మండలం చౌదర్‌పల్లి వెంకటయ్య వీధి నాటకం, జుంటుపల్లి వెంకటప్ప తోలుబొమ్మల ప్రదర్శన అలరించాయి. సినీ నటుడు మాగంటి మురళీమోహన్ కళాకారులను అభినందించి ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జానపద కళాకారుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు రమణాచారి, రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి లింగయ్య, లేడీ వింగ్ అధ్యక్షురాలు విజయ, కార్యదర్శి కవిత, జిల్లా గౌరవాధ్యక్షుడు అంజిలప్ప, నాయకులు కృష్ణయ్య, వెంకటయ్య, వినోద, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ మైనార్టీ డివిజన్ అధ్యక్షుడిగా ఇనాయత్

నియామకపత్రాన్ని అందుకుంటున్న ఇనాయత్ అలీ

మేడ్చల్ టౌన్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): కష్టపడి పని చేసే వారికి పార్టీలో సముచిత స్థానం లభిస్తుందని డీసీసీ అధ్యక్షుడు వజ్రేశ్‌యాదవ్ అన్నారు. సోమవారం ఆయన మేడ్చల్ 297వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ మైనారిటీ అధ్యక్షుడిగా సయ్యద్ ఇనాయత్ అలీకి నియామకపత్రం అందజేశారు. వజ్రేశ్ మాట్లాడుతూ.. పదవులు పొందిన వారు పార్టీ బలోపేతానికి కృషిచేయాలన్నారు. స్థానిక సమస్యలపై దృష్టిసారించి పరిష్కరించి గుర్తింపు పొందాలని సూచించారు. ఇనాయకత్ ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలని సూచించారు. పార్టీ పదవికి పూర్తి న్యాయం చేస్తానని ఇనాయత్ అన్నారు. కార్యక్రమంలో జిల్లా మైనారిటీ వింగ్ అధ్యక్షుడు అజీజుల్లా బేగ్, ఉపాధ్యక్షుడు అయూబ్ ఖాన్, నాయకులు అశ్రఫ్, ఇమ్రాన్, శఫీ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సీఎస్‌ఐ చర్చి వార్షికోత్సవాలు

మేడ్చల్ టౌన్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): ఎల్లంపేట్ మున్సిపాలిటీ డబిల్‌పూర్ సీఎస్‌ఐ, ఎస్‌టీ మ్యాథ్యూస్ చర్చి పదో వార్షికోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. చర్చిలో ప్రార్థనలు చేశారు. మహిళలు, చిన్నారుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మెదక్ డయాసిస్ బిషప్ డాక్టర్ రాబిన్ మార్క్ దైవ సందేశాన్ని విన్పించారు. మెదక్ చర్చి డయాసిస్ మినిస్టీరియల్ బోర్డు కార్యదర్శి కె.అంద్రూస్ ప్రేమ్‌కుమార్, జార్జ్, చర్చి సెక్రటరీ దినకర్ పాల్గొన్నారు.

కార్యక్రమంలో చిన్నారుల నృత్యాలు

ఎరువుల దందాకు బ్రేక్

- కొడంగల్‌లో విజిలెన్స్ తనిఖీలు
- స్టాక్ లెక్కల్లో తేడాలు..రెండు దుకాణాలపై కేసులు

కొడంగల్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): కొడంగల్‌లోని ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సోమవారం తనిఖీలు నిర్వహించారు. యూరియా, డీఏపీ అధిక ధరలకు విక్రయిస్తున్నారంటూ రైతుల ఫిర్యాదుల మేరకు తనిఖీలు చేపట్టారు. వైష్ణవి ఫర్టిలైజర్స్‌లో అమ్మకాలు నిలిపి వేయాలని ఆదేశించారు. ఓం ట్రేడింగ్ షాపులో స్టాక్ లెక్కల్లో తేడాలను గుర్తించారు. రెండు దుకాణాలపై కేసులు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని ఇన్‌చార్జి ఏవో కొమురయ్య హెచ్చరించారు.

ఫర్టిలైజర్స్ షాపులో తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్స్ అధికారులు

బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడికి పరామర్శ

కులకచర్ల, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు శేరి రామ్‌రెడ్డి మాతృమూర్తి పద్మమ్మ స్వర్గస్తులయ్యారు. సోమవారం పరిగి మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ చౌడాపూర్ మండల అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, నాయకులు శ్రీశైలం, కృష్ణయ్య గౌడ్, నర్సిములు తదితరులు పాల్గొన్నారు.

కొండాకల్‌లో కొత్తచెరువు కనుమరుగు!

శంకర్‌పల్లి, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): కొండాకల్‌లోని కొత్తచెరువును కొందరు అక్రమార్కులు మట్టితో పూడ్చివేస్తున్నారు. ఇతర ప్రాంతాల్లో నుంచి మట్టిని వాహనాల్లో తెచ్చి చెరువులో పోస్తున్నారు. వర్షాకాలంలో చెరువులో నీరు నిండితే గ్రామంలో భూగర్భజలాలు పెరిగి ప్రజలకు నీటి సమస్య లేకుండా ఉండేది. కానీ, అక్రమార్కుల ఆగడాలతో చెరువు కనుమరుగయ్యే దుస్థితి ఏర్పడింది. ఇంత జరుగుతున్నా నీటి పారుదల, రెవెన్యూ శాఖల అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై నీటి పారుదల శాఖ ఏఈ వరప్రసాద్‌ను వివరణ కోరగా మట్టితో చెరువును పూడ్చుతున్న విషయం తమ దృష్టికి వచ్చిందని, వెంటనే గ్రామంలోని చెరువు వద్దకు వెళ్లి పరిశీలించామని, మట్టిపోస్తున్న వారిని గుర్తించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మట్టి పోసి చెరువును పూడ్చి వేస్తున్న దృశ్యం

ఘనంగా వీరభద్రేశ్వరస్వామి జాతర

దుద్యాల్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఈర్లపల్లి శివారులో కొలువుదీరిన వీరభద్రేశ్వరస్వామి జాతర వైభవంగా సాగింది. సోమవారం ఉదయం స్వామివారికి రుద్రాభిషేకం, శివపార్వతుల కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి ఆలయంలో పూజలు నిర్వహించారు. మొక్కులు చెల్లించుకొని స్వామివారి ఆశీస్సులు పొందారు. అనంతరం నిర్వాహకులు అన్నదానం కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకుడు నరసింహారెడ్డి, సర్పంచ్ మొగులయ్య, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు రవినాయక్ తదితరులు పాల్గొన్నారు.

కల్యాణోత్సవం నిర్వహిస్తున్న పురోహితులు

20ఏళ్లుగా శిలాఫలకాలకే పరిమితం

- సొంతభవనాలకు నోచని మైన్స్, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు
- స్థలాలు లేవంటున్న రెవెన్యూ అధికారులు .. కలెక్టర్ చొరవ చూపాలని విన్నపం

మైన్స్, సబ్‌రిజిస్టర్ కార్యాలయాల నిర్మాణానికి వేసిన శిలాఫలకాలు (ఫైల్)

తాండూరు, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): తాండూరు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని ఈ శిలాఫలకాలను వేసి 20సంవత్సరాలు(రెండు దశాబ్దాలు)దాటింది. 2006 ఫిబ్రవరి 19న అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గనులు, భూగర్భ వనరులు, ఐటీ శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అప్పటి ఎమ్మెల్యే ఎం.నారాయణరావుతో కలిసి ఈ శిలాఫలకాలను వేశారు. తాండూరు సబ్-రిజిస్ట్రార్, గనులు, భూగర్భ వనరుల(మైన్స్) కార్యాలయాలకు సొంత భవనాలు నిర్మించాలనే ఉద్దేశ్యంతో శంకుస్థాపన చేశారు. అంతవరకు బాగానే ఉంది. ఈరెండు భవనాలు ఈ స్థలంలో నిర్మించాలంటే స్థలం సరిపోదని, ఎక్కువ స్థలం అవసరమని కొంత కాలం తర్వాత అధికారులు తేల్చారు. జిల్లాలోనే అధికంగా ప్రభుత్వానికి రాబడినిచ్చే సబ్‌రిజిస్ట్రార్, మైన్స్(గనుల)శాఖలకు స్థలం లేదన్న కారణంగా సొంత భవనాలకు నోచుకోవడంలేదు. ఈ శాఖల్లో పని చేసే అధికారులు, సిబ్బందితో పాటుకార్యాలయాలకు వచ్చే ప్రజలు, వ్యాపారులు, అద్దెభవనాల్లో వసతులు లేక అవస్థలు పడుతున్నారు.

వేలల్లో అద్దె చెల్లింపులు

నెలనెలా ఈరెండు కార్యాలయాలకు వేలల్లో అద్దెలు చెల్లిస్తున్నారు. అందులో రికార్డులు సైతం సరిగ్గా పెట్టుకోలేని పరిస్థితి ఉంది. ప్రస్తుతం తాండూరు పట్టణంలో ప్రభుత్వ భూములున్నాయి. కబ్జాలకు గురవుతున్న ఈస్థలంలో ప్రభుత్వ కార్యాలయాలైన మైన్స్, సబ్‌రిజిస్ట్రార్ సొంత భవనాలు నిర్మించుకునేందుకు కేటాయించాలని కోరుతున్నారు. తాండూరు నుంచి ప్రభుత్వానికి ఆదాయాన్నిస్తున్న మైన్స్, సబ్ రిజిస్ట్రార్, ఎక్సైజ్ కార్యాలయాలకు సొంత భవనాలను నిర్మించాలని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిని అధికారులు, సిబ్బంది కోరుతున్నారు. ఇందుకు స్థలాలను కేటాయించేందుకు రెవెన్యూ అధికారులను ఆదేశించాలని ప్రజాప్రతినిధులు డిమాండ్ చేస్తున్నారు.

నాలా దారి మళ్లింపు

శంకర్‌పల్లి, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): కొండాకల్ గ్రామంలో రియల్ ఎస్టేట్ వ్యాపారులు సహజసిద్ధంగా ఏర్పడిన నాలాను దారి మళ్లిస్తున్నారు. గ్రామంలోని ఎత్తైన ప్రాంతం నుంచి వరదనీరు దిగువప్రాంతానికి పారేది. దీంతో అధికారులు గతంలో కల్వర్టును నిర్మించారు. అయితే భూములకు విలువ పెరగడంతో ప్లాట్లు చేసేందుకు కొందరు ఏర్పాట్లు చేశారు. కాగా భూములు కొనుగోలు చేసిన వారు నాలానుంచి వచ్చే వరదనీటిని దారి మళ్లించేందుకు పక్క నుంచి పైపులు వేస్తున్నారు. నీటి పారుదల శాఖ అధికారుల అనుమతి లేకుండానే ఇష్టానుసారంగా పనులు నిర్వహిస్తుండటంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై నీటిపారుదల శాఖ ఏఈ వరప్రసాద్‌ను వివరణ కోరగా పనులు జరుగుచున్న ప్రాంతాన్ని పరిశీలించానని, పనులు నిలిపివేయాలని ఆదేశించినట్లు తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా జరుగుచున్న పనుల గురించి పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లినట్లు పేర్కొన్నారు.

అనుమతి లేకుండా జరుగుతున్న నాలా పనులు

అంతర్రాష్ట్ర మహిళా దొంగ అరెస్టు

- సాంకేతికతతో నిందితురాలిని గుర్తించిన సీసీఎస్ బృందం

వివరాలు వెల్లడిస్తున్న సీసీఎస్ సీఐ బల్వంత్‌రాయ్

వికారాబాద్/తాండూరు, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): ఆధునిక టెక్నాలజీతో ఆధారాలు సేకరించి అంతర్రాష్ట్ర మహిళా దొంగను సీసీఎస్ పోలీసులు అరెస్టు చేశారు. నిందితురాలు ఒంటరి, వితంతు, వృద్ధ మహిళలతో సాన్నిహిత్యాన్ని పెంచుకొని వారి బంగారు ఆభరణాల తస్కరించింది. ఇలాంటి ఘటనలు తాండూరులో ఐదు, కర్ణాటకలో 3 కేసులు జరిగాయని సీసీఎస్ సీఐ బల్వంత్‌రాయ్ తెలిపారు. చోరీజరిగిన ప్రాంతాల్లో సీసీ కెమెరాలు, ఇతర సాంకేతిక ఆధారాలను విశ్లేషించి నిందితురాలి కదలికలను గుర్తించి అరెస్ట్ చేసినట్లు చెప్పారు. ఇందుకు సంబంధించి వికారాబాద్‌లో సోమవారం ఆయన వివరాలు వెల్లడించారు. తాండూరు ప్రాంతంలో చోటుచేసుకున్న బంగారు ఆభరణాల చోరీ కేసుల ఛేదనకు ఎస్పీ స్నేహమెహ్రా వికారాబాద్ సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ బల్వంత్‌రాయ్‌ని నియమించారు. బల్వంత్‌రాయ్ తన టీంతో నిందితురాలి కదలికలను గుర్తించారు. తాండూరు పట్టణంలో ఐదు కేసుల్లో 9.5తులాల బంగారు ఆభరణాలు చోరీచేయగా కర్ణాటక రాష్ట్రం గదగ్ పట్టణంలో, నవనగర్ పరిధిలో 14.5 తులాల బంగారు ఆభరణాలను తస్కరించినట్టు తెలిపారు. అలాగే నిందితురాలిపై మహారాష్ట్ర, హైదరాబాద్ నగరంలోనూ కేసులు నమోదైనట్టు తెలిపారు. తాండూరు టౌన్ ఎస్సై మమత ఆధ్వర్యంలో హెడ్‌కానిస్టేబుల్ జయవర్ధన్, శివకుమార్, పీసీలు రామకృష్ణ, సాయప్ప, శివరాజ్, పాండు, రాజు, రవీందర్, గాయత్రిలు ఈ కేసుల ఛేదనలో కృషి చేశారన్నారు. అదనపు ఎస్పీ రాజేష్ మీనా పోలీసు అధికారులు, సిబ్బందిని అభినందించారని ఆయన చెప్పారు.

దళిత క్రైస్తవులపైనే ఆంక్షలెందుకు?

యాలాల, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): రిజర్వేషన్ల విషయంలో ఎస్టీ, బీసీ, ఓసీ వర్గాలకు లేని ఆంక్షలు దళిత క్రైస్తవులకే ఎందుకని కుల అసమానతల నిర్మూలన పోరాట సమితి జిల్లా కన్వీనర్ కర్రె కిష్టప్ప ప్రశ్నించారు. సోమవారం మండలంలోని దేవనూరులో దళిత క్రైస్తవుల సమావేశం కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించాలని కోరారు. ఈ నెల 4న తాండూరులోని విలియంమూన్ హైస్కూల్‌లో జరిగే సమావేశానికి దళితక్రైస్తవులు పెద్దఎత్తున హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో ఎ.వెంకటయ్య, కుల అసమానతల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర నాయకులు మెట్లి నరేష్, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు నర్సింహులు, సూర్య ప్రకాష్, ఏసప్ప, సామెల్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న సమితి నాయకులు

ప్రభుత్వాలు హామీలను అమలు చేయాలి

పూడూరు, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలిచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం నాయకులు పూడూరు డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు పి.రామకృష్ణ, నాయకులు పలువురు మాట్లాడారు. విద్య, వైద్యం, ఉద్యోగం, ఉపాధి, ఇండ్ల స్థలాలు, రేషన్ షాపుల్లో 14 రకాల సరుకులివ్వాలని, కొత్త పెన్షన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ఎన్నికల మ్యానిఫెస్టోను అమలు చేయాలన్నారు. తుర్కఎన్కెపల్లి-చిట్టెంపల్లి రోడ్డు పనులను ప్రారంభించి రెండేళ్లవుతున్నా పూర్తిచేయలేదన్నారు. పంటలకు సరిపడా ఎరువులను సరఫరా చేయాలని, యూరియా, డీఏపీ ధరలను నిర్ధారిత రేట్లకే విక్రయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు పి.రామకృష్ణ, నాయకులు నట్టల నర్సింహులు, నూనె నర్సింహులు, జె.నర్సింహులు, విజయ్, తిరుపతి పాల్గొన్నారు.

డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

షీ టీమ్ సేవలపై అవగాహన ఉండాలి

షీటీమ్ విధులపై వివరిస్తున్న అధికారులు

వికారాబాద్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): షీ టీమ్ నిర్వహణపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని షీటీమ్ ఇన్‌చార్జి బుచ్చేందర్‌రెడ్డి, డబ్ల్యూపీసీ రేష్మ అన్నారు. సోమవారం వికారాబాద్‌లోని శివారెడ్డిపేట మైనారిటీ బాలికల పాఠశాలలో షీ టీమ్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించింది. వారు మాట్లాడుతూ.. షీ టీం, టీ సేఫ్‌యాప్, అత్యవసర సమయాల్లో 112కు కాల్ చేయడం వంటి వాటిపై వివరించారు. పోక్సో, యాంటీ డ్రగ్స్, యాంటీ ర్యాగింగ్ యాక్ట్‌లపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఎలాంటి సమస్యలెదురైనా నిర్భయంగా పోలీసులను సంప్రదించాలని, మహిళలు, బాలికల భద్రతకు పోలీస్ శాఖ నిరంతరం అందుబాటులో ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పుష్పలత, అధ్యాపకులు పాల్గొన్నారు.

బస్తీ దవాఖానాలకు వైద్యులను నియమించండి

ఘట్‌కేసర్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్ డివిజన్ ఎన్ఎఫ్‌సీ నగర్, బాలాజీనగర్ బస్తీ దవాఖానాల్లో వైద్యులను నియమించి రోగులకు సేవలందించాలని డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు బొక్క ప్రభాకర్‌రెడ్డి సోమవారం కలెక్టరేట్‌లోని ప్రజావాణిలో అధికారులకు ఫిర్యాదులు చేశారు. సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాని జిల్లా ఉన్నతాధికారులు డీఎంహెచ్‌వోకు సూచించారు. కాగా ప్రభాకర్‌రెడ్డి డీఎంహెచ్‌వో అనంద్‌ను కలిసి సమస్యను వివరించడంతో 15 రోజుల్లో వైద్యులను నియమించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు ప్రభాకర్‌రెడ్డి తెలపారు. అధికారులను కలిసిన వారిలో మండల రైతు సమన్వయ సమితి మాజీ అధ్యక్షుడు అంజిరెడ్డి, సుధాకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

డీఎంహెచ్‌వోకు వినతిపత్రం ఇస్తున్న ప్రభాకర్‌రెడ్డి

రోడ్డు పనుల వేగవంతానికి చర్యలు తీసుకోండి

- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి నాయకుల వినతి

పూడూరు, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): మండల పరిధి అంగడిచిట్టెంపల్లి-కంకల్-లాల్‌పహాడ్ రోడ్డు పనులను వేగవంతం చేసేలా చర్యలు తీసుకోవాలని మండల నాయకులు రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి వినపత్రం అందించారు. సోమవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో మంత్రి, శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ వికాస్‌రాజ్‌లను కాంగ్రెస్ పార్టీ జిల్లా ఐటీ ఇన్‌చార్జి రవీంద్ర కంకల్, కో-కన్వీనర్ కననయ్య, రాజు, కండ్లపల్లి శివరాజ్‌లు కలిశారు. అంగడిచిట్టెంపల్లి-కంకల్‌లాల్‌పహాడ్ రోడ్డు పనులు పెండింగ్‌లో ఉన్నాయని, త్వరగా పూర్తి చేయించాలని మంత్రిని కోరారు.

పింఛన్ దరఖాస్తుదారుల తంటాలు

- చివరి రోజు కావడంతో ఆఫీసుల చుట్టూ ప్రదక్షిణలు

కొడంగల్ రూరల్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం కొత్త పెన్షన్ల మంజూరు దరఖాస్తులకు ఆగస్టు 31 చివరి తేదీ విధించడంతో సోమవారం కొడంగల్‌లో తహసీల్దార్ కార్యాలయం, మీ-సేవ, జిరాక్స్ సెంటర్ల వద్ద సందడి నెలకొంది. పింఛన్ దరఖాస్తులకు అవసరమయ్యే ధ్రువపత్రాల కోసం తహసీల్దార్ కార్యాలయానికి.. అక్కడ తీసుకున్న సర్టిఫికెట్లను అందజేసేందుకు ఎంపీడీవో కార్యాలయానికి తిరిగారు. 'దరఖాస్తయితే చేస్తున్నాం. పింఛన్ వస్తుందో.. రాదో..' అని దరఖాస్తుదారులు చర్చించుకున్నారు.

బాలికలకు కరాటేలో శిక్షణ

బాలికలకు కరాటే నేర్పుతున్న మాస్టర్

కోట్‌పల్లి, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): కోట్‌పల్లి జెడ్పీ పాఠశాలలో బాలికలకు సెల్ఫ్ డిఫెన్స్ కరాటే, మార్షల్ ఆర్ట్స్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సోమవారం కరాటే మాస్టర్ మహమ్మద్ ఖలీల్ బాలికలకు ఆత్మరక్షణకు సంబంధించిన కరాటే, మార్షల్ పద్ధతులను శిక్షణిచ్చారు. కార్యక్రమంలో ఎంఈవో చంద్రప్ప, విద్యార్థులు పాల్గొన్నారు.

బోర్‌వెల్ పనుల ప్రారంభం

వికారాబాద్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): వికారాబాద్ మునిసిపాలిటీ 10వ వార్డు అనంతగిరిపల్లి బలిజగూడెంలో తాగునీటి సమస్య పరిష్కారానికి బోర్‌వెల్ పనులను సోమవారం ప్రారంభించారు. డ్రిల్లింగ్‌కు వైస్ చైర్మన్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు అర్థ సుధాకర్‌రెడ్డి కొబ్బరికాయ కొట్టారు. ఆయన మాట్లాడుతూ.. బోర్‌వెల్ మంజూరు చేసినందుకు అసెంబ్లీ స్పీకర్, స్థానిక ఎమ్మెల్యే ప్రసాద్‌కుమార్, మున్సిపల్ చైర్‌పర్సన్ అనన్యలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు రెడ్యానాయక్, సోషల్ మీడియా కోఆర్డినేటర్ నందు, పవన్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

సిబ్బందితో మాట్లాడుతున్న డీసీపీ అంజయ్య

పోలీసు రికార్డుల పరిశీలన

కోట్‌పల్లి, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): సంవత్సరం వార్షికోత్సవంలో భాగంగా సోమవారం వికారాబాద్ డీసీపీ అంజయ్య కోట్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో రికార్డులను పరిశీలించి, సిబ్బందితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఆయన మాట్లాడారు.. స్టేషన్‌లో పెండింగ్ ఫైల్స్ లేకుండా పూర్తిచేసి, ఎక్కడా అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూడాలన్నారు. స్టేషన్ ఆవరణను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా మాట్లాడాలన్నారు. ఆయన వెంట ధారూర్ సీఐ రఘురాములు, ఎస్ఐ శైలజ, సిబ్బంది తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడిగా

సంతోష్‌కుమార్

కొడంగల్, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడిగా కొడంగల్ మండలం పాటిమీదిపల్లికి చెందిన వార్ల సంతోష్‌కుమార్ ఎన్నికయ్యారు. సంతోష్‌కుమార్‌కు ఉపాధ్యక్షుడి పదవి రెండోసారి దక్కింది. మరోసారి ఆయనకు బాధ్యతలు అప్పగించడంతో నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సంతోష్‌కుమార్ కాంగ్రెస్ అధిష్ఠానం, పార్టీ నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.

సీఎం రేవంత్‌రెడ్డితో వార్ల సంతోష్‌కుమార్

శ్రీనివాస్‌కు ఘన సన్మానం

రిటైరైన ఉద్యోగులను సన్మానిస్తున్న డిపో సూపరింటెండెంట్ రామ్మోహన్‌రావు, సిబ్బంది

శామీర్‌పేట, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): హకీంపేట్ ఆర్టీసీ డిపోలో సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ ఉద్యోగ విరమణ సందర్భంగా సోమవారం ఆయనను సన్మానించారు. డిపో సూపరింటెండెంట్ మురారి రామ్మోహన్‌రావు మాట్లాడుతూ.. శ్రీనివాస్ సేవలు అభినందనీయమని కొనియాడారు. అలాగే రిటైరైన మరో ఇద్దరు అమర్‌నాథ్, ఏడీసీ నాగరాజులను సిబ్బంది, యూనియన్ నాయకులు సన్మానించారు. కార్యక్రమంలో భూపాల్, మౌనిక, సంధ్య, కృప, పవన్‌కుమార్, శ్రీశైలం, తులసీరామ్, శ్రీనివాస్, రాజేందర్, రమేశ్, కన్నారెడ్డి, సుగుణాచారి పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగికి సత్కారం

శివకుమార్ దంపతులను సన్మానిస్తున్న పీఆర్టీయూ నాయకులు

తాండూరు, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): తాండూరు ప్రభుత్వ నం:1 ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహించిన ఉపాధ్యాయుడు శివకుమార్ ఉద్యోగ విరమణ సందర్భంగా సన్మానించారు. సోమవారం పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయనను ఘనంగా సన్మానించారు. సన్మానించిన వారిలో పీఆర్టీయూ నాయకులు నర్సిరెడ్డి, నాగప్ప, జైపాల్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

స్కూల్ యూనిఫామ్ పంపిణీ

శామీర్‌పేట, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి):శామీర్‌పేట మండల పరిషత్ పాఠశాలలో సోమవారం విద్యార్థులకు ప్రభుత్వం అందించిన యూనిఫామ్స్, షూను జిల్లా ఆర్టీఏ సభ్యుడు భీమిడి జైపాల్‌రెడ్డి పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమం తప్పక పాఠశాలకు హాజరై మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం శంకర్‌నాయక్, కాంగ్రెస్ నాయకులు శంకర్‌గౌడ్, అశోక్, మాజీ సర్పంచ్ కిషోర్ యాదవ్, సాయిబాబా, బిక్షపతి, బాల్‌రామ్, శ్రీనివాస్, వెంకటేశ్, శ్రీనివాస్, బుచ్చిబాబు, శ్రీనివాస్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, టీచర్లు పాల్గొన్నారు.

సేవలతోనే ఉద్యోగులకు గుర్తింపు

యాలాల: ఉద్యోగ విరమణ పొందిన ఎంఈవో మహిపాల్‌రెడ్డిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

కులకచర్ల: ఎంపీడీవో కార్యాలయంలో కార్యదర్శి సన్మాన సభలో సొసైటీ చైర్మన్ భీమ్‌రెడ్డి, అధికారులు

యాలాల, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుడిగా పనిచేసిన ఎంఈవో మహిపాల్‌రెడ్డి ఎందరో విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపారని, వారి జీవితాలను తీర్చిదిద్దారని తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. మహిపాల్‌రెడ్డి కోకట్ జెడ్పీ స్కూల్ హెచ్ఎంగా పనిచేసి ఐదేళ్ల ఎంఈవోగా బాధ్యతలు చేపట్టారు. సోమవారం ఆయన రిటైర్మెంట్ కార్యక్రమాన్ని కోకట్ రోడ్డులో గల వెంకటేశ గార్డెన్‌లో నిర్వహించారు. ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎంఈవో మహిపాల్‌రెడ్డి దంపతులను ఎమ్మెల్యే సన్మానించారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగులకు రిటైర్మెంట్ తప్పదని, అయితే వారి ఉద్యోగకాలంలో అందించిన సేవలే గుర్తింపునిస్తాయన్నారు. కాగా మహిపాల్‌రెడ్డి రచించిన 'యాలాల.. వైభవపు వెలుగుల జ్వాల' అనే పుస్తకాన్ని ఎమ్మెల్యే ఆవిష్కరించారు. అంతకు ముందు మహిపాల్‌రెడ్డి ఫంక్షన్ హాల్ వరకు ర్యాలీగా తరలొచ్చారు. ఎస్ఎస్‌సీ, పాఠశాల విద్యార్థులు పాల్గొని మహిపాల్‌రెడ్డికి స్వాగతం పలికారు. కార్యక్రమంలో మాజీ సొసైటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ కరణం పురుషోత్తం రావు, మున్సిపల్ మాజీ చైర్మన్ లక్ష్మారెడ్డి, కాంగ్రెస్ నాయకులు సంపుఖర్తి హన్మంతు, మైపాల్, ఎంపీడీవో శ్రీనిజ, కోకట్ సర్పంచ్ రాజేందర్‌రెడ్డి, పీఆర్టీ నాయకుడు కృష్ణారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కులకచర్ల: ఉద్యోగులకు ఉద్యోగ విరమణ తప్పదని, నర్సింహులు కాలంలో ఉత్తమ సేవలతో గుర్తింపు పొందారని సొసైటీ చైర్మన్ భీమ్‌రెడ్డి అన్నారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో చౌలాపల్లి పంచాయతీ కార్యదర్శి కరుణాకర్ రెడ్డి రిటైర్మెంట్ సన్మాన సమావేశాన్ని నిర్వహించారు. కార్యదర్శిని సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రామకృష్ణ, కాంగ్రెస్ నాయకులు కృష్ణారెడ్డి, కార్యదర్శులు పాల్గొన్నారు.

ధారూరు: రిటైరైన వాటర్‌మన్ నర్సింహులును సన్మానిస్తున్న డీఎంహెచ్‌వో సుధాకర్‌లాల్ తదితరులు

మోమిన్‌పేట్: విధి నిర్వహణలో అంగన్‌వాడీ టీచర్ అరుణ చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అందించిన సేవలు మరువలేనివని జెడ్పీ పాఠశాల హెచ్ఎం మల్లేశం అన్నారు. వెల్చాల్ అంగన్‌వాడీ టీచర్ అరుణ ఉద్యోగ విరమణ సందర్భంగా సన్మాన సభ నిర్వహించారు. ఉద్యోగ విరమణ సహజమే అయినా, చేసిన సేవలు చిరస్థాయిగా నిలిచిపోతాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనివాస్, మాజీ సర్పంచ్ విట్టల్, నాయకులు మధుసూదన్‌రెడ్డి, రమేశ్, కృష్ణయ్య, నరహరి, నర్సింహులు, మాధవరెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పుష్పలత, వైద్యులు, అంగన్‌వాడీ టీచర్లు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ధారూరు: ధారూరు ఆరోగ్య కేంద్రంలో ఉద్యోగ విరమణ పొందిన వాటర్‌మన్ నర్సింహులును అధికారులు, సిబ్బంది సన్మానించారు. కార్యక్రమంలో డీఎం హెచ్‌వో సుధాకర్‌లాల్ పాల్గొని నర్సింహులుకు మెమొంటో అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. వాచ్‌మన్ నర్సింహులు ధారూరులోనే ఉద్యోగం పొంది అదే ఆస్పత్రిలో రిటైర్ కావడం గొప్ప విషయమన్నారు. వైద్య శాఖలో ఏ స్థాయి ఉద్యోగి రిటైరైనా సన్మాన కార్యక్రమంలో తాను పాల్గొంటానని తెలిపారు. పీహెచ్‌సీల వైద్యాధికారులు శాంతి, జ్యోతి, శ్వేత, మేఘన, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పూడూరు: మండల సర్వే చైన్‌మన్ కావలి మల్లయ్య రిటైర్మెంట్ కార్యక్రమం తహసీల్దార్ కార్యాలయ భవనంపై నిర్వహించారు. కార్యక్రమానికి తహసీల్దార్ విజయకుమార్, డీటీ, సిబ్బంది హాజరై మల్లయ్య దంపతులను సన్మానించారు. అధికారులు మల్లయ్య సేవలను కొనియాడారు.

మోమిన్‌పేట్ : ఉద్యోగ విరమణ సభలో నాయకులు

పూడూరు: సర్వే చైన్‌మన్ మల్లయ్య దంపతులను సన్మానిస్తున్న తహసీల్దార్, అధికారులు

ఇసుకాసురులు

(మూడో పేజీ తరువాయి)

పరిగి సబ్ డివిజన్‌లోని ప్రభుత్వ కార్యాలయాల ముందు నుంచే తరలిపోతున్నాయి. అనుమతి ఉన్న వాహనాలను సిండికేటుగాళ్లు' బరితెగించి అడ్డుకుంటున్నారు. పోలీసులకు మామూళ్లు ముడుతుండటంతో వారు కూడా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు.

అధిక ధరలకు విక్రయిస్తూ..

ప్రభుత్వం ఇళ్ల నిర్మాణాల కోసం కొన్ని నెలల నుంచి యాలాల్ మండలం పరిధిలోని వాగుల నుంచి ఇసుక తీసుకునేందుకు నిబంధనలను కొంత సులభతరం చేశారు. దీన్ని అదునుగా తీసుకొని వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. కాగా, ఇళ్లు, ఇతర నిర్మాణ పనులకు చేపట్టే వారికి ఇసుక తెచ్చేందుకు ఇబ్బందులవుతున్నాయనే పేరుతో రేట్లను పెంచుతున్నారు. నెల క్రితం టన్ను ఇసుక రూ.1,200 నుంచి రూ.1,500 వరకు ఉండేది. పది రోజుల నుంచి రూ.2,000 నుంచి నాణ్యతను బట్టి రూ.2,300లకు విక్రయిస్తున్నారు.

లారీకి రూ.30వేల చొప్పున

పరిగి ప్రాంతంలో ఇసుక మాఫియా ద్వారా లక్షల రూపాయాలు చేతులు మారుతున్నట్లు ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. ఇసుక మాఫియాలో రెవెన్యూ, మైనింగ్, పోలీస్‌శాఖల ప్రమేయం ఉంటుందని బాహాటంగానే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. కొందరు ఏకంగా ఇసుక లారీలు వచ్చే సమయానికి రహస్య ప్రాంతానికి వెళ్లి నేరుగా డబ్బులు వసూలు చేసుకుంటున్నారనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. రెగ్యులర్‌గా నడిచే వ్యాపారుల వద్ద పోలీసులు ఒక్కో లారీకి నెలకు రూ.30వేలు వసూలు చేస్తున్నట్లు సమాచారం. ఇలా ఇరవైకిపైగా రెగ్యులర్‌గా ఇసుక లారీలు నడుస్తున్నట్లు తెలుస్తుంది. ట్రాక్టర్‌కు నెలకు రూ.10 నుంచి రూ.15 వేల వరకు వసూలు చేస్తున్నట్లు సమాచారం. ఇవి కాకుండా కొత్తగా వచ్చిన లారీలు, ట్రాక్టర్ల నుంచి దొరికినప్పుడల్లా ఇష్టారీతిన వసూలు చేస్తున్న దుస్థితి. పరిగి వరకు ఇసుక అనుమతి ఉండే ఇసుక గ్రామాల్లోకి తీసుకెళ్లడానికి నిబంధనలు లేవు. గ్రామాలకు తీసుకవెళ్లి విక్రయిస్తే అదనంగా చెల్లించాల్సి ఉంటుందని వ్యాపారులు చెబుతుండటం గమనార్హం.

కేసులు నమోదు చేస్తాం

అక్రమంగా ఇసుకను తరలిస్తే కేసులు నమోదు చేస్తాం. ఇసుకను సిండికేట్ ధరలకు విక్రయించొద్దు. పోలీసులు ఎవరైనా డబ్బులు వసూలు చేస్తే మా దృష్టికి తేవాలి. వసూళ్లకు పాల్పడితే విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం. అక్రమ ఇసుక గురించి రెవెన్యూ వారి సహకారంతో కేసులు పెడతాం. అక్రమ ఇసుక రవాణపై స్పెషల్ డ్రైవ్ చేసి చర్యలు తీసుకుంటాం.

- కొండల్‌రెడ్డి, సీఐ, పరిగి

బలహీనులకు బలాన్నిద్దాం

(మూడోపేజీ తరువాయి)

కుటుంబాలకు పోషణ మాసోత్సవాల్లో పోషకాహారం అందించనున్నారు.

తొలత అవగాహన కల్పన

పోషకాహర లోపంతో ఉన్న గర్భిణులు, బాలింతలను గుర్తించి పౌష్టికాహారం అందిస్తారు. ఇప్పటికే అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా బాలామృతం, బాలామృతం ప్లస్ పంపిణీ చేస్తున్నారు. గుర్తించిన వారికి తగిన వైద్యమందేలా చూడటంతో పాటు ఆరోగ్యగంగా ఉండేందుకు కౌన్సెలింగ్ సైతం ఇప్పిస్తారు. రక్తహీనత, పర్యావరణ పరిరక్షణ, వ్యక్తిగత పరిశుభ్రత వంటి అంశాలపై అవగాహన కార్యక్రమాలు చేపడుతారు.

ఆటపాటలతో కార్యక్రమాలు

పోషణ మాసోత్సవం నేడు (సెప్టెంబరు 1వ తేదీ) ప్రారంభంకానుంది. విద్య, వైద్యం, పంచాయతీరాజ్ శాఖల సహకారంతో రోజూ ఒక కార్యక్రమాన్ని ఎంపిక చేసుకుని 30వ తేదీ వరకు కార్యక్రమాలు నిర్వహిస్తారు. పిల్లలకు ఆట పాటలు, మాతృపోషణ, తక్కువ బరువు, ఎత్తు, పౌష్టికాహార లోపం ఉన్న పిల్లల ఇళ్ల వద్దకు వెళ్లడం, కిశోర బాలికలకు సూచనలు, ఆరోగ్య కార్యక్రమాలు, మొక్కలు నాటడం, తదితరాలను పండుగ వాతావరణంలో చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేసి అమలు చేయిస్తున్నారు. ప్రజల భాగస్వామ్యంతో గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలు, కిశోర బాలికలు తీసుకోవాల్సిన పోషకాహారం, తదితర అంశాలపై అవగాహన కల్పించాలని కలెక్టర్ ఇప్పటికే దిశానిర్దేశం చేశారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న చైర్ పర్సన్ కంతం శిరీషా కృష్ణారెడ్డి

శామీర్‌పేట, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): అలియాబాద్ మున్సిపల్ పరిధిలోని లాల్‌గడి మలక్‌పేట్ 15వ వార్డులో సోమవారం రూ.8 లక్షలు మున్సిపల్ జనరల్ నిధులతో సీసీ రోడ్డు పనులను చైర్‌పర్సన్ కంతం శిరీషాకృష్ణారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతీ వార్డులో మౌలిక వసతుల కల్పన, అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ప్రజలకు మెరుగైన రహదారులు, మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యం అన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ మాలతి మాధవరెడ్డి, కౌన్సిలర్ తాళ్ల స్వప్న రాంప్రసాద్, కమిషనర్ వెంకట్‌రెడ్డి, అధికారులు, మున్సిపల్ సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

నేడు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

పరిగి, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): మంగళవారం నుంచి క్లస్టర్ స్థాయి గ్రామాల్లో స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేస్తామని తహసీల్దార్ వెంకటేశ్వరి తెలిపారు. రైతు వేదికల్లో ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి చేతుల మీదుగా పంపిణీ జరుగుతుందని తెలిపారు.

పేదల సొంతింటి కలకు ఇందిరమ్మ స్కీం భరోసా

మోమిన్‌పేట్: గృహ ప్రవేశ కార్యక్రమంలో నూతన వస్త్రాలను అందజేస్తున్న చైర్మన్ మహేందర్‌రెడ్డి

మోమిన్‌పేట్/కులకచర్ల, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం మోమిన్‌పేట్ మండలం బాల్‌రెడ్డిగూడెం, మొరంగపల్లి గ్రామాల్లో స్పీకర్ ప్రసాద్‌కుమార్ ఆదేశాల మేరకు ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించారు. లబ్ధిదారులకు నూతన వస్త్రాలను అందజేశారు. చైర్మన్ మాట్లాడుతూ.. నిరుపేదల సొంతింటి కలను సాకారం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం అన్నారు. అర్హులైన ప్రతీ కుటుంబానికి సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శంకర్‌యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి సిరాజుద్దీన్, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు సురేందర్, సర్పంచ్‌లు అనంత్‌రెడ్డి, కల్పనహరీశ్‌కుమార్ రెడ్డి, నాయకులు మానెయ్య, వెంకట్, మహంతస్వామి పాల్గొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ఇంటి కలను సాకారం చేస్తోందని కులకచర్ల మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గోపాల్‌నాయక్ అన్నారు. మంగలి లావణ్య ఇందిరమ్మ గృహ ప్రవేశానికి ఆయన హాజరయ్యారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ భీమ్‌రెడ్డి, ఎంపీడీవో రామకృష్ణ, పరిగి బ్లాక్-బి అధ్యక్షుడు భరత్‌కుమార్, నాయకులు కృష్ణారెడ్డి, వెంకటయ్య, శ్రీనివాస్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రామచంద్రయ్య పాల్గొన్నారు.

కులకచర్లలో గృహ ప్రవేశంలో కాంగ్రెస్ నాయకులు

కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడిగా మురళీగౌడ్

బొంరాస్‌పేట్,ఆగస్టు31(ఆంధ్రజ్యోతి):మండలంలోని ఎన్కెపల్లి గ్రామ కాంగ్రెస్ కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మురళీగౌడ్, ఉపాధ్యక్షులు సురేందర్‌చారి, లక్ష్మప్ప ఎన్నికయ్యారు. పార్టీ బలోపేతానికి కృషిచేస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ బాల్‌రాజ్, వీరేశం, రాజశేఖర్‌రెడ్డి, హరీశ్‌గౌడ్, నర్సిములు, కృష్ణ, నర్సిరెడ్డి, రమేశ్, జైపాల్, గోపాల్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

శ్రీకాంత్ మృతదేహం

యాలాల, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): తాగుడుకు బానిసై కడుపునొప్పితో బాధపడుతూ ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన జుంటుపల్లిలో చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించి ఎస్ఐ విఠల్‌రెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చెందిన అంటి శ్రీకాంత్(24) మద్యానికి బానిసయ్యాడు. శ్రీకాంత్ పాత ఇంటిని కూల్చి కొత్త ఇల్లు నిర్మించడంతో అప్పులయ్యాయి. దీనికి తోడు ఆరోగ్య సమస్య కూడా ఉండటం, అప్పుల బాధతో ఆదివారం పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబీకులు వికారాబాద్‌లోని మిషన్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడని ఎస్ఐ తెలిపారు. శ్రీకాంత్ తండ్రి రాములు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ విఠల్‌రెడ్డి తెలిపారు.

దాడి కేసులో చిక్కిన నిందితుడు

నిందితుడిని చూపుతున్న సీఐ పరమేశ్వర్

తాండూరు, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): ఇంట్లో ఒంటరిగా ఉన్న మహిళపై దాడి చేసి బంగారు ఆభరణాలను చోరీ చేసిన నిందితుడిని తాండూరు పోలీసులు పట్టుకున్నారు. ఆభరణాలను రికవరీ చేశారు. ప్రధాన నిందితుడు పరారీలో ఉన్నారు. పట్టణ సీఐ పరమేశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం.. తాండూరులోని బసవేశ్వర్‌నగర్‌లో ఇంట్లో ఒంటరిగా ఉన్న ఉమాదేవిపై ఇంటి పనిమనిషి భర్త మొగులప్ప గొంతు నులిమి బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లాడు. ప్రధాన నిందితుడు మొగులప్పకు అతడి స్నేహితులు సహకారం అందించినట్లు తెలిపారు. ఉమాదేవి మెడలోని నల్లపూసల దండ, బంగారు ఆభరణాలను తీసుకొని పరారయ్యారు. సోమవారం శివాజీచౌక్ వద్ద సంజీవను పట్టుకున్నాని, చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నామని సీఐ వివరించారు. నిందితుడిని రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. ప్రధాన నిందితుడు మొగులప్ప కోసం గాలిస్తున్నట్టు సీఐ తెలిపారు.

నవదుర్గ కాలనీలో చోరీకి యత్నం

ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): పోచారం ఐటీ కారిడార్ పోలీసుస్టేషన్ పరిధి ఇస్మాయిల్‌ఖాన్‌గూడ సమీపంలోని నవదుర్గ కాలనీలో దొంగలు చోరీకి యత్నించారు. బాలబద్ర శ్రవంతి ఆగస్టు 29న స్వగ్రామం వరంగల్‌కు వెళ్లి తిరిగి 31న రాత్రి ఇంటికి వచ్చారు. అప్పటికే చోరీ జరిగిందని గుర్తించారు. చోరీపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు పరిసరాలను పరిశీలించారు. సీసీ పుటేజీలను పరిశీలించగా ఆదివారం అర్ధరాత్రి దొంగలు ఇంట్లోకి ప్రవేశించినట్టు కనిపించింది. అయితే ఇంట్లో ఏమీ చోరీకి కాలేదని బాధితురాలు తెలిపారు. నిందితుల కోసం గాలింపు చర్యలు చేపడుతున్నామని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నాగేశ్వర్‌రావు తెలిపారు.

బియ్యం వాహనాన్ని పట్టుకున్న పోలీసులు

ధారూరు, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద బియ్యం వాహనాన్ని తాండూర్-వికారాబాద్ రోడ్డులో సోమవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. తాండూర్ నుంచి వికారాబాద్ వెళ్తున్న డీసీఎంలో రేషన్ బియ్యం ఉందనే అనుమానంతో టాస్క్‌పోర్స్ వాహనాన్ని తనిఖీ చేసి పోలీసు స్టేషన్‌కు తరలించారు. సివిల్ సప్లయిస్ అధికారులకు సమాచారం ఇచ్చారు. అధికారులు బియ్యం నమూనాలను సేకరించి పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపించారు. ల్యాబ్ నివేదికను బట్టి చర్యలు తీసుకుంటామని సీఐ రఘురాం తెలిపారు. వాహనంలో 100 బియ్యం సంచులు ఉన్నాయన్నారు.

నిషేధిత పదార్థాలతో బేకరీ నిర్వహణ

శామీర్‌పేట, ఆగస్టు 31 (ఆంధ్రజ్యోతి): కొల్తూర్ గ్రామంలోని శ్రీ సాయి బేకరీలో హానికారక సింథటిక్ కలర్స్, మిక్స్‌డ్ ఫ్రూట్ ఫ్లేవర్స్ వినియోగిస్తున్నట్లు గుర్తించి కేసు నమోదు చేసినట్లు సీఐ గురువయ్యగౌడ్ తెలిపారు. సోమవారం జీనోమ్ వ్యాలీ పోలీసులు, ఎస్‌వోటీ కుత్బుల్లాపూర్ పోలీసులు తనిఖీలు నిర్వహించి 18.5లీటర్ల ద్రావణ పదార్థాలు, 2.5కిలోల డెజో కోకో పౌడర్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిషేధిత పదార్థాలను వినియోగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

జేపీఎస్‌లో పీటీఏ సమావేశం

జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో జరిగిన పీటీఏ సమావేశంలో నిర్వాహకులు, తల్లిదండ్రులు

కీసర, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): రాంపల్లి దాయరలోని జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌లో పేరెంట్స్, టీచర్ అసోసియేషన్(పీటీఏ) సమావేశం జరిగింది. సోమవారం పాఠశాలలో ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డైరెక్టర్ వరలక్ష్మి విచ్చేసి మాట్లాడారు. పాఠశాల భవిష్యత్తు ప్రణాళికలు, కమిటీ విలువలను, విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలపై వివరించారు. ఈ విద్యా సంవత్సరం నుంచి 6, 9తరగతుల్లో అమలు చేస్తున్న మూడు భాషల విధానం, బోర్డు పరీక్షలు, సీటీ, ఏఐ, ఆర్ట్/ఫిజికల్ ఎడ్యుకేషన్, కొత్త మూల్యాంకన పద్ధతులపై వివరించారు. పాఠశాలలో నిర్వహించే కార్యక్రమాల గురించి పీటీఏతో తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఆనంతరం పాఠశాల అభివృద్ధికి సలహాలు, సూచనలు స్వీకరించారు.

విద్యుత్ సమస్యలను పరిష్కరించాలి

మల్కాపూర్‌లో విద్యుత్ సమస్యపై ఏఈకి వివరిస్తున్న సర్పంచ్

తాండూరు రూరల్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): తాండూరు మండల పరిధిలోని మల్కాపూర్‌లో విద్యుత్ సమస్యలు వెంటనే పరిష్కరించాలని, సర్పంచ్ పండరి విద్యుత్ ఏఈ పర్వతాలును కోరారు. సోమవారం ఏఈ మల్కాపూర్ గ్రామాన్ని సందర్శించి సర్పంచ్ చెప్పిన సమస్యలను విన్నారు. గ్రామంలో వేలాడుతున్న విద్యుత్ వైర్లతోపాటు విరిగిన స్తంభాల స్థానంలో కొత్తవాటిని మారుస్తామని అన్నారు. అవసరం ఉన్న చోట ట్రాన్స్‌ఫార్మర్ కూడా అమర్చే విధంగా చర్యలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు వెంకటేష్, ఘనాపూర్ మైనుద్దీన్, లైన్‌మెన్ ప్రసాద్ తదితరులున్నారు.

కందకం పూడ్చివేత పనుల ప్రారంభం

కొడంగల్ రూరల్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): మండల పరిధి పర్సాపూర్‌లో సోమవారం కందకం పూడ్చివేత పనులకు మున్సిపల్ చైర్మన్ నందారం ప్రశాంత్, సర్పంచ్ కన్నం రాధశ్రీనివాస్‌రెడ్డి భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గతంలో గ్రామం చుట్టు భద్రత కోసం తవ్విన కందకం నేడు గ్రామం మధ్యలోకి వచ్చిందన్నారు. గ్రామంలో కొత్తగా అభివృద్ధి పనులు చెపట్టడం కోసం గతంలో తవ్విన కందకాన్ని పూడ్చి ఆ స్థలాన్ని చదును చేసి మౌలిక వసతుల కల్పన కోసం ఉపయోగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సంజీవరెడ్డి, ఉపాధ్యక్షులు సంతోష్‌కుమార్, బాల్‌రాజ్, గ్రామ అధ్యక్షుడు శ్రీశైలం, ఉపాధ్యక్షుడు నర్సింలు, ఉపసర్పంచ్ బెస్త శివమ్మ, నాయకులు రాములు, మల్లేషం, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు అధికారులు పాల్గొన్నారు.

నేడు మండల సమీక్ష సమావేశం

పరిగి, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): పరిగి మండల పరిషత్ సమీక్ష సమావేశం మంగళవారం ఉదయం 11గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో హరిప్రియ సోమవారం తెలిపారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి పాల్గొంటారని తెలిపారు. మండల స్థాయి అధికారులు, సర్పంచ్‌లంతా తప్పకుండా హాజరు కావాలని ఆమె కోరారు.

సంక్షిప్తంగా ...

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

శామీర్‌పేట, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): తూంకుంటలోని విజ్ఞాన భారతి హైస్కూల్‌లో విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. రహదారి భద్రత, ట్రాఫిక్ నిబంధనలు పాటించాల్సిన ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీఐలు పవన్‌కుమార్‌రెడ్డి, జానకిరాములు, ఎస్సై నవీన్‌రెడ్డి, పాఠశాల కరస్పాండెంట్ హనుమంత్‌రెడ్డి, జంగారెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి

కొడంగల్, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): తరచూ జరుగుతున్న రోడ్డు ప్రమాదాల నివారణకు జాగ్రత్తలు పాటించాలని పోలీసులు సూచించారు. సోమవారం హైదరాబాద్-బీజాపూర్ మార్గంలో వాహనదారులు, ప్రయాణికులకు కొడంగల్ శివారులోని వేంకటేశ్వర ట్రేడర్స్ సమీపంలో అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని సూచించారు. ఆటో డ్రైవర్లు లైసెన్స్‌తో పాటు అన్నీ పత్రాలు కలిగి ఉంటూ పరిమితికి మించి ప్రయాణికులను తరలించొద్దన్నారు. వారం రోజుల వ్యవధిలో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో పలువురు మృతి చెందిన సంఘటనలు బాధాకరం అన్నారు.

ప్రజా సమస్యలపై సీఐకి వినతి

శామీర్‌పేట, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): తుర్కపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై సీఐ గురవయ్యకు మహిళా శక్తి ఫైవాయిస్ సంఘం వ్యవస్థాపక అధ్యక్షురాలు, బీజేపీ రాష్ట్ర నాయకురాలు ఎన్.హైమారెడ్డి వినతి పత్రం అందజేశారు. మండలంలోని అలియాబాద్‌లో దొంగతనాల నియంత్రణ, ఆన్‌లైన్ బెట్టింగ్, డిజిటల్ మోసాలపై చర్యలు, రాజీవ్ రహదారి ట్రాఫిక్ సమస్యల పరిష్కారం, భద్రతకు చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రజావాణికి నాలుగు దరఖాస్తులు

తాండూరు రూరల్, ఆగస్టు31(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో నాలుగు దరఖాస్తులు అందాయని నోడల్ అధికారి, ఎంపీడీవో విశ్వప్రసాద్ తెలిపారు. ప్రజావాణిలో తహసీల్దార్ తారాసింగ్, ఎంఈవో ఇందుప్రియ, ఏవో కొమురయ్య, ఏపీఎం బాలయ్య, ఎక్సైజ్ సీఐ రాణి పాల్గొన్నారు.

ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలి

మర్పల్లి, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): ప్రజలు ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని ఎంపీడీవో శాంత సూచించారు. ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో వివిధ సమస్యలపై 12 ఫిర్యాదులు అందినట్లు తెలిపారు. ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు అన్ని శాఖల అధికారులు ప్రజావాణిలో అందుబాటులో ఉంటారని తెలిపారు. ప్రజావాణిలో ఫిర్యాదు చేసి సంబంధిత అధికారుల దృష్టికి సమస్యలను తీసుకెళ్లాలని సూచించారు.

అందని ఫిర్యాదులు

కోట్‌పల్లి, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి):కోట్‌పల్లిలో మండల పరిషత్‌లో నిర్వహించిన ప్రజావాణికి ప్రజల నుంచి ఫిర్యాదులేవీ రాలేదని ఎంపీడీవో హేమంత్ తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆనంద్‌రావు, ఎంఈవో చంద్రప్ప, డాక్టర్ మేఘన పాల్గొన్నారు.

ప్రజావాణికి రాని అన్ని శాఖల అధికారులు

ధారూరు, ఆగస్టు 31(ఆంధ్రజ్యోతి): ప్రతి సోమవారం మండల పరిషత్తులో నిర్వహిస్తున్న ప్రజావాణిలో అన్ని శాఖల అధికారులు కనిపించటం లేదు. ప్రజావాణికి కొందరు అధికారులే హాజరవుతున్నారు. వచ్చిన అధికారుల్లో కొందరు కొద్దిసేపు కూర్చొని వెళ్తున్నారు. అధికారుల తీరుతో ప్రజావాణి ఉద్దేశ్యం నీరుగారుతోందని మండల ప్రజలు అంటున్నారు.

ధారూరులో ప్రజావాణికి హాజరైన అధికారులు